



**దేవులపల్లి అమర్**

(రచయిత ప్రజాతంత్ర వ్యవస్థాపక సంపాదకుడు,
ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి అధ్యక్షుడు)

# ప్రజాతంత్రకు ఇప్పుడెవరు రాస్తారు?

**“ ప్రజాతంత్రకు ఏమైనా రాయండి అని అడిగితే మొహం చాటేసిన వాళ్లూ ఉన్నారు. రెమ్యునరేషన్ ఏమిస్తారు? అని అడిగినవాళ్లూ ఉన్నారు. స్వతంత్రంగా నిలబడటానికి ‘ప్రజాతంత్ర’ సాగించిన ప్రయత్నానికి చేయూతగా నిలిచి రచనలు చేసిన వాళ్లూ ఉన్నారు. ఐతే వేర్వేరు కారణాల వల్ల చాలా మంది ప్రజాతంత్రకు రాయడం మానేసారు. బాలగోపాల్ మాత్రం చివరి దాకా తన కాలమ్ ‘నిగాహ్’ కొనసాగించాడు. ప్రజాతంత్ర పాఠకులు ఆయన అభిప్రాయాలను ఇకపైన చదవలేరన్నది జీర్ణించుకోజాలని విషయం. ”**

బాలగోపాల్ ఆకస్మిక మరణం వల్ల దేశంలోని ప్రజాతంత్ర ఉద్యమాలకు మానవ హక్కుల ఉద్యమాలకు ఎంత తీరని నష్టం జరిగిందో ‘ప్రజాతంత్ర’ అనే “చిన్న” వార పత్రికకు అంత కంటే ఎక్కువ నష్టం జరిగింది.

హంగులూ ఆర్భాటాలూ కోట్లాది రూపాయల పెట్టుబడులూ లేకుండా ప్రారంభమై దాదాపు 12 సంవత్సరాలుగా అన్ని కష్టాలూ ఎదుర్కొని ఆగకుండా నడుస్తున్న పత్రిక ప్రజాతంత్ర. పత్రిక ప్రారంభమైన మొదటి నెల నుంచే (బహుశా 1998 జనవరి లేదా ఫిబ్రవరి నెల) బాలగోపాల్ కాలమ్ **‘నిగాహ్’** ప్రజాతంత్రలో రాయడం ప్రారంభించారు.

అప్పట్లో ప్రజాతంత్ర సంపాదకుడిగా నేనే ఆయనను అడిగాను పత్రికకు ఒక కాలమ్ రాయండి అని. ఆయనను అడిగినట్టే మరికొందరు పెద్దలను కూడా అడిగాను. కొందరు రాస్తామని ముందుకు వచ్చారు. మరికొందరు ఎంతకాలం నడుస్తుందిలే పత్రిక స్థిరపడనీ అప్పుడు ఆలోచిద్దాం అన్నారు. రాయడానికి ముందుకొచ్చిన వాళ్లలో కూడా కొందరు అనేక కారణాల వల్ల మధ్యలో మానేసారు.

ఒక్క బాలగోపాల్ మాత్రమే ప్రజాతంత్రకు తాను కాలమ్ రాయడం ప్రారంభించినప్పటి నుంచి చనిపోయే పదిహేను రోజుల ముందు దాకా ఏ ఒక్కసారీ ఆపకుండా ప్రజాతంత్రకు తన కాలమ్ **‘నిగాహ్’** రాసాడు. తీరిక లేనంత పనిలో ఉండి



కూడా రాష్ట్రమంతటా తిరుగుతూ ప్రజల సమస్యల మీద చేస్తున్న ఉద్యమం ఒత్తిడిలో ఉండి కూడా ఆయన ప్రజాతంత్రకు పదిహేను రోజులకోసారి కాలమ్ రాయకుండా ఉండలేదు. ఏదో ఒక విధంగా కాలమ్ ప్రజాతంత్రకు చేరేట్టు చూసేవాడు.

ఈ పన్నెండేళ్ల కాలంలో ఆయన ప్రజాతంత్రలో తన కాలమ్‌లో బహుశా తడమని అంశం లేదు. మొదట్లో నేను కాలమ్ రాయాలని కోరినప్పుడు ఏం రాయమంటావు? అని అడిగాడు. మీ ఇష్టం మీరు ఏది రాసినా సరే అన్నాను. రాయడం మొదలు పెట్టాడు, ఎక్కడా ఆపలేదు.

బాలగోపాల్ చనిపోయిన రోజు ఆయన ఇంటి దగ్గరనే అనుకుంటా ఒక మిత్రుడు అజయ్ (ప్రస్తుత ప్రజాతంత్ర సంపాదకుడు) తో చెప్పిన మాటలు ఏ విషయంలోనైనా సరే అది ఎంత చిన్నదైనా సరే బాలగోపాల్ కమిట్‌మెంట్‌ను గుర్తు చేస్తాయి. చనిపోయే కొద్ది రోజుల ముందు బాలగోపాల్ ఏ తెల్లవారుఝామునో ఆ మిత్రుడి ఇంట్లో కిటికీ నుంచి ఓ కవర్ జారవిడిచి వెళుతుంటే మెళకువగానే ఉన్న అతను తలుపు తెరిచి ఏమిటి అట్లా వెళ్లిపోతున్నారని అడిగితే అర్జెంట్‌గా ఊరు వెళ్లాలి, ప్రజాతంత్రకు నా కాలమ్ అందజేయండి అని చెప్పి వెళ్లిపోయాడట. ఒక వారం ప్రజాతంత్రకు కాలమ్ రాయకపోతే అడిగేవాళ్లు లేరు, కానీ ఆయన కమిట్‌మెంట్ అటువంటిది.

మొన్న 12వ తేదీన బాలగోపాల్ సంస్మరణ సభ రోజు ఉదయం మరో మిత్రుడు కోదండ్ (ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు) నేను "కాఫీ విత్ సాక్షి'' ఉదయం కార్యక్రమంలో కలుసుకున్నప్పుడు ప్రజాతంత్రకు బాలగోపాల్ రాసిన కాలమ్ ప్రస్తావన వచ్చింది. అప్పుడు కోదండ్ జ్ఞాపకం చేసుకున్న మాటలు పెద్ద పెట్టుబడులకు నోచుకోక కమిట్‌మెంట్‌తో నడిచే పత్రికల పట్ల బాలగోపాల్ కన్‌సర్న్‌ను గుర్తు చేస్తాయి.

చాలా మంది బాలగోపాల్‌తో అనేవాళ్లు ప్రజాతంత్రలో మీరు రాస్తున్న కాలమ్‌లో చాలా వైవిధ్యం ఉంది. అనేక విషయాల మీద మీ విశ్లేషణ, అభిప్రాయం తెలుస్తున్నది, కానీ ప్రజాతంత్ర లో రాస్తే ఎక్కువ మంది చదవరు కదా ఏదైనా పెద్ద పత్రికకు రాయరాదా అని. అప్పుడు బాలగోపాల్ ఈ పత్రికలకే రాయాలి, మనం రాయకపోతే ఇటువంటి పత్రికలకు ఎవరు రాస్తారు? అని చెప్పారు. ఈ విషయం కోదండ్ చెప్పాడు నాకు.

ప్రజాతంత్రకు ఏమైనా రాయండి అని అడిగితే మొహం చాటేసిన వాళ్లూ ఉన్నారు. రెమ్యునరేషన్ ఏమిస్తారు? అని అడిగినవాళ్లూ ఉన్నారు. స్వతంత్రంగా నిలబడటానికి 'ప్రజాతంత్ర' సాగించిన ప్రయత్నానికి చేయూతగా నిలిచి రచనలు చేసిన వాళ్లూ ఉన్నారు. ఐతే వేర్వేరు కారణాల వల్ల చాలా మంది ప్రజాతంత్రకు రాయడం మానేసారు. బాలగోపాల్ మాత్రం చివరి దాకా తన కాలమ్ **'నిగాహ్'** కొనసాగించాడు. ప్రజాతంత్ర పాఠకులు ఆయన అభిప్రాయాలను ఇకపైన చదవలేరన్నది జీర్ణించుకోజాలని విషయం.

మధ్యలో ఒక్కసారి బాలగోపాల్ కాలమ్ అందలేదు. ఏం జరిగిందోనని వసంతకు ఫోన్ చేసాను. 'నాకు తెలియదయ్యా ఆయన రాయనంటున్నారు, ఆయనతోనే మాట్లాడుకో' అన్నది.

అదే సాయంత్రం ఆనంద్ నగర్‌లో ఆయన ఇంటికి వెళ్లాను. ఇద్దరు, ముగ్గురు క్లయింట్‌లు ఉన్నారు. అప్పుడే కోర్టు నుండి వచ్చినట్టున్నాడు. బాలగోపాల్ దగ్గర నాకు ఎంత చనువు ఉందో ఆయనంటే అంత భయం కూడా.

కొందరితో అంతే. వాళ్లు నిర్వహిస్తున్న ఉద్యమాలతో, వాళ్లు నాయకత్వం వహిస్తున్న లేదా ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థల్లో సభ్యుడిగా లేకున్నా వాళ్ల కట్టుబాట్లు, క్రమశిక్షణల పరిధిలోకి రాకున్నా, ఒకళ్లిద్దరంటే నాకు ఆ భయం వాళ్ల పట్ల ఉన్నా గౌరవం, అభిమానం వల్లనే అనుకుంటాను. అటువంటి వాళ్ల కోవలోకి వచ్చే వ్యక్తి బాలగోపాల్.

ఏందిట్లా వొచ్చినావ్ అన్నాడు బాలగోపాల్. జంకుతూనే మాట్లాడాలె అన్నాను. క్లయింట్‌లను మాట్లాడి పంపించేసాడు. ఏంటి సంగతి అంటే కాలమ్ రాయనన్నారట అన్నాను.

నువ్వు జియర్ స్వామిని తీసుకొచ్చి పత్రిక ఫంక్షన్ చేస్తుంటే నేనెందుకు రాయాలి? అన్నాడు. నాకు ఇది తట్టనే లేదు. అంతకు కొద్దిరోజుల ముందే ప్రజాతంత్ర హైదరాబాద్ నగరంలో సాయంకాలం దినపత్రికగా తీసుకొస్తే బాగుంటుందనే ఆలోచన ప్రజాతంత్ర యాజమాన్యానికి వచ్చింది. ఆ సాయంకాలం పత్రికను చిన జియర్ స్వామి ఒక ఫంక్షన్‌లో ఆవిష్కరించారు.

> **"చాలా మంది బాలగోపాల్‌తో అనేవాళ్లు ప్రజాతంత్రలో మీరు రాస్తున్న కాలమ్‌లో చాలా వైవిధ్యం ఉంది. అనేక విషయాల మీద మీ విశ్లేషణ, అభిప్రాయం తెలుస్తున్నది, కానీ ప్రజాతంత్రలో రాస్తే ఎక్కువ మంది చదవరు కదా ఏదైనా పెద్ద పత్రికకు రాయరాదా అని. అప్పుడు బాల గోపాల్ ఈ పత్రికలకే రాయాలి, మనం రాయకపోతే ఇటువంటి పత్రికలకు ఎవరు రాస్తారు? అని చెప్పారు. ఈ విషయం కోదండ్ చెప్పాడు నాకు."**

బాలగోపాల్ కాలమ్ ఆపేస్తాననడానికి ఇదీ కారణమని నాకు తట్టనే లేదు. ఏం చెయ్యాలో తెలియక మౌనంగా కూర్చున్నాను. ఆయనే కల్పించుకుని సరే రాస్తాను, కానీ ఈ వారం చిన్న జియ్యర్ స్వామిని విమర్శిస్తూ రాస్తే వేసుకుంటావా అన్నాడు. 'తప్పకుండా' అన్నాను. ప్రజాతంత్రలో ఆ సమస్య ఎప్పుడూ లేదు. అన్ని అభిప్రాయాలూ ప్రజలకు చేరాలన్నదే ఆ పత్రిక అభిమతం.

అయితే, మరెందుకో గాని బాలగోపాల్ తాను అన్నట్టుగా జియ్యర్ స్వామికి వ్యతిరేకంగా ఏమీ రాయలేదు. ఆ తరువాత ఎప్పుడూ ఆయన కాలమ్ ఆగలేదు. సాహిత్యం మీద ఆయన అభిప్రాయాలకు సంబంధించిన చివరి ఇంటర్వ్యూ కూడా ప్రజాతంత్రలోనే వచ్చింది.

దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రజాతంత్ర ప్రచురించిన ఒక ప్రత్యేక సాహిత్య సంచికలో బాలగోపాల్‌ను ప్రస్తుత ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ ఇంటర్వ్యూ చేసారు.

ఆయన ఆకస్మిక మరణం కారణంగా **'నిగాహ్'** కాలమ్ ఆగిపోవడాన్ని మించిన బాధాకరమైన విషయం నా వరకు నాకు ఇంకొకటి ఉండదు.

దాదాపు 250 వారాలు ఆయన కాలమ్ నడిచింది ప్రజాతంత్రలో. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లి (ఇపిడబ్ల్యూ) వంటి గొప్ప పత్రికల వాళ్లే అడిగి రాయించుకునే స్థాయి బాలగోపాల్‌ది. ఆయనకు మాత్రం అవేమీ పట్టవు. ఆ తేడాలు ఆయనకు ఉండవు. అందుకే మనం రాయకపోతే ప్రజాతంత్రకు ఎవరు రాస్తారు? అని ప్రశ్నించాడు.

నిజానికి, కొంతకాలంగా బాలగోపాల్ ప్రజాతంత్రలో చేసిన రచనలన్ని పుస్తకంగా తీసుకు రావాలనే ఆలోచనలో మేం ఉన్నాం. అందుకు అవసరమైన సహకారం అందించడానికి వసంత ముందుకు వచ్చింది. కొన్ని వారాలు మ్యాటర్ కంపోజ్ చేయడం, ప్రూఫ్‌లు చూడటం, మిస్సింగ్‌లను సరిచేయడం వంటి పనులు కూడా చేసింది వసంత.

ఇప్పుడు ఆయన లేదు ఆయన రచనలు ఉన్నాయి. వాటిలో ఆయన ఆలోచనలున్నాయి, అభిప్రాయాలున్నాయి, ప్రజల హక్కుల రక్షణ పట్ల ఆయన ఆకాంక్షలున్నాయి.

ఆయన రచనల ప్రచురణ ద్వారా వాటన్నిటిని మరింత మంది ప్రజల దగ్గరకు చేర్చే ప్రయత్నం ద్వారా ప్రజాతంత్ర ఆయనకు నివాళులు అర్పించదల్చుకున్నది.

ప్రజాతంత్ర కుటుంబం తరఫున బాలగోపాల్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

*

**(వ్యక్తిగతంగా, జర్నలిజం వృత్తిపరంగా, జర్నలిస్ట్ ఉద్యమ కార్యకర్తగా నాకు మానవ హక్కుల మహనీయ నేత బాలగోపాల్‌తో ఉన్న అనుబంధాన్ని గురించి వచ్చే వారాల్లో తప్పక రాస్తాను.)**